క్లుప్తంగా

యువత చేయూత



ములుగు : ములుగు పంచాయతీ పరిధిలోని ప్రేమ్‌నగర్ గ్రామానికి చెందిన రత్నం కుమార్ ఇళ్లు అగ్నిప్రమాదంలో కాలిపోయి నష్టపోయారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక యువకులు తలా కొంత సేకరించి బాధిత కుటుంబానికి బుధవారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జంగిలి రవితేజ, బండారి ప్రణీత్, లావుడ్య ప్రవీణ్, లావుడ్య రఘు, ఇమ్మడి రాము, కొత్తపల్లి శ్రావణ్, నద్దునూరి రవీందర్, పూర్ణచందర్, రఘురాం, భద్రయ్య, శ్రీనివాస్, నక్క నరేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలతో పంటకు నష్టం

మల్లూర్: కల్తీ విత్తనాలతో కారణంగా తన వరి పంటకు నష్టం జరిగిందని మండలం తాడిచర్లకు చెందిన రైతు రామిడి రాజయ్య బుధవారం ఆరోపించారు. గ్రామంలోని ఓ ఎరువుల దుకాణంలో 10రకం వరి విత్తనాలు కొనుగోలు చేశానని తెలిపారు. తనకున్న రెండున్న ఎకరాల్లో సాగు చేయగా సగం పంట పొట్ట దశలో ఉండగా మరి కొంత గింజలకు వచ్చిందని తెలిపారు. పంట సాగు కోసం ఎకరాలకు రూ.20 వేలు పెట్టుబడులు ఖర్చు చేసినట్లు తెలిపా రు. బెరుకులతో దిగుబడి రాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

పోచమ్మ బోనాలు

చిట్యాల: మండల కేంద్రంలోని రాంనగర్, చిట్యా ల, చింతలపల్లి గ్రామాల్లో పోచమ్మ బోనాల పండుగ బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకుని డప్పు చప్పుళ్లతో పోచమ్మ దేవాలయాలకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకానికి సంబంధించి నిరుద్యోగ యువతి యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ అడ్డూరి బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 5 వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ యువత ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రింట్, దరఖాస్తుదారుడి పాస్ ఫొటో, ధృవీకరణ పత్రాల జిరాక్స్‌లను మండల పరిషత్ కార్యాలయంలోని ప్రజాపాలన సేవా కేంద్రంలో సమర్పించాలన్నారు.

వినోద్‌కుమార్ శుక్లాకు అవార్డుపై హర్షం

టేకుమట్ల: హిందీ రచయిత, కవి, వ్యాసకర్త వినోద్‌కుమార్ శుక్లా జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపిక కావడం హర్షనీయమని తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వినోద్ కుమార్‌శుక్ల అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న మొదటి రచయిత అని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి రూరల్: పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. జిల్లా బీసీ సంఘం నాయకుడు భీమనాథుని సత్యనారాయణ బుధవారం భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందించారు. సత్యనారాయణ మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలకు మంచినీటి కొరత ఉందని, సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలు లేని వార్డుల్లో నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కోరారు. అదేవిధంగా అంబేడ్కర్ సెంటర్ నుంచి ఓసీ టు వరకు రోడ్లు నిర్మాణ పనులు ఆగిపోయాయని, తిరిగి చేపట్టి పూర్తి చేయాలని కోరారు.

చీటింగ్ కేసు నమోదు

రేగొండ: గతంలో భాగిర్థిపేట బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా విధులు నిర్వహించిన గోపాల్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భాగిర్థిపేట గ్రామంలో గతంలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా విధులు నిర్వహించిన గుగులోతు గోపాల్ ప్రభుత్వ అనుమతి లేకుండా తన సొంత అవసరాలకు రూ.99 వేలు వినియోగించినట్లు ఆడిట్‌లో వెల్లడైంది. కాగా నిధుల దుర్వినియోగానికి పాల్పడిన గోపాల్‌పై కేసు నమోదు చేయాలని భూపాలపల్లి సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గోపాల్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ముందస్తు అరెస్ట్

చిట్యాల: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న పడిదల దేవేందర్‌ను పోలీసులు బుధవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. సెక్యూరిటీ గార్డుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగే మహాసభకు వెళ్లకుండా అరెస్ట్ చేసినట్లు ఏఎస్సై సమ్మిరెడ్డి తెలిపారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- డ్రెయినేజీల్లో పేరుకుపోతున్న మురుగు
- రోగాలబారిన ప్రజలు
- నిధుల లేమితో అధికారులకు తిప్పలు
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు

కన్నాయిగూడెం : గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది.. చెత్తాచెదారం, డ్రెయినేజీల్లో మురుగు నిలిచి పల్లెల్లో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయి..సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత ప్రభుత్వం అధికారులను నియమించి ప్రత్యేక పాలనను కొనసాగిస్తోంది..కానీ నిధులు లేక ఎక్కడి పనులు అక్కడే పేరుకుపోతున్నాయి. పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన పంచాయతీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రత్యేకాధికారుల పాలన నుంచి పారిశుద్ధ్య పనులు ఎక్కడా వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. డ్రెయినేజీల్లో మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతున్నాయి. దోమలు వ్యాప్తి చెంది, ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. పారిశుద్ధ్యం పడకేసిన పంచాయతీ అధికారులు మాత్రం వాటిపై దృష్టిసారించడం లేదు. ఇదే విషయంపై పంచాయతీ అధికారులను వివరణ కోరగా గ్రామ పంచాయతీ ఖాతాల్లో నిధులు లేక, కనీసం ట్రాక్టర్‌లో డీజిల్ పోయడానికి కూడా డబ్బులు లేక అప్పులు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు.

నిధులు లేక ఇబ్బందులు..

మండల కేంద్రంతో పాటు 11గ్రామ పంచాయతీల్లో ఎక్కడికక్కడ అస్తవ్యస్త పారిశుద్ధ్యంతో దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారులకు వారంలో ఒక రోజు పంచాయతీ సిబ్బంది పైపై పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. మిగతా రోడ్లు, పనుల జోలికి మాత్రం వెళ్లడం లేదు. ఇదేంటని అడిగితే గ్రామ పంచాయతీ ఖాతాల్లో ప్రభుత్వం నిధులు జమ చేయడం లేదని పేర్కొంటున్నారు. కనీసం ట్రాక్టర్లల్లో డీజిల్ పోయడానికి డబ్బులు లేక అప్పులు చేస్తున్నామని వాపోయారు. తమ జీతం సరిపోక బయటి నుంచి అప్పులు చేయాల్సి వస్తోందని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. దీంతో నిధులు లేకపోవడంతో కార్యదర్శుల పరిస్థితి ముందు నుయ్యి, వెనక గొయ్యి అన్నట్లు తయారైంది. ఇప్పటికైనా గ్రామ పంచాయతీలకు సరిపడ నిధులు విడుదల చేసి పారిశుద్ధ్య పనులు చేయించాలని ప్రజలు, అధికారులు కోరుతున్నారు.



గూర్రేవులలో రోడ్డు పక్కన నిలిచిన మురుగునీరు

కంపుకొడుతున్న డ్రెయినేజీలు..

మండల కేంద్రంతో పాటు ముప్పనపల్లి, లక్ష్మీపురం, గూర్రేవుల, కన్నాయిగూడెం, ఏటూరు, సింగారం మిగతా గ్రామాల్లోనూ డ్రెయినేజీ సమస్య ఇబ్బందిగా తయారైంది. కాల్వల్లో మురుగు పేరుకుపోయి, నెలల తరబడి తొలగించకుండా ఉండడంతో అందులో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పలుమార్లు అధికారుకలు తెలిపిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ముప్పనపల్లిలో చెత్తతో నిండిన డ్రెయినేజీ

చెత్తను తొలగించాలి



మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది చెత్తాను తొలగించడం లేదు. పండుగ సమయంలో, లేదంటే ఎవరైనా ఉన్నతాధికారులు వస్తున్నారంటే మాత్రమే శుభ్రం చేస్తున్నారు. డ్రెయినేజీ కాల్వలు మురుగుతో నిండి ఉంటున్నాయి. ఎవరూ కూడా పట్టించుకోవడంలేదు. మురుగుతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

\- కావిరి అంజన్‌రావు, స్థానికుడు

ఇబ్బంది లేకుండా చూస్తాం..

మండలంలో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేయిస్తున్నాం. కానీ నిధుల కొరతతో పనులు చేసేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అయినా ఆయా గ్రామాల్లో చెత్తాచెదారాన్ని వెంటనే తొలగిస్తాము. డ్రెయినేజీల్లో పేరుకుపోయిన మురుగును తొలగించే పనులు చేపడతాం. ఇకనుంచి ఎప్పటికప్పుడు చెత్తాను తొలగించి ప్రజలకు ఇబ్బందిలేకుండా చూస్తాం.

\- అనిత, ఎంపీడీఓ, కన్నాయిగూడెం

అధిక లోడ్‌తో వెళ్తున్న లారీల పట్టివేత

ఏటూరునాగారం : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధికలోడుతో వెళ్తున్న నాలుగు ఇసుక లారీలను పట్టుకున్నట్లు రెవెన్యూ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ గంపల శంకర్ తెలిపారు. మండలంలోని చిన్నబోయినపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఇసుక లారీల చెక్‌పోస్టులో మంగళవారం రాత్రి తనిఖీ చేయగా రెండు లారీలు, బుధవారం తనిఖీ చేయగా మరో రెండు ఇసుక లారీలు అధిక లోడుతో వస్తున్నట్లు గుర్తించామని శంకర్ పేర్కొన్నారు. వాటిని నిలిపివేసి వే బ్రిడ్జి వద్ద తూకం వేయగా అధికంగా ఇసుక ఉన్నట్లు తెలిసిందని చెప్పారు. ఈ నాలుగు లారీలు భద్రాద్రికొత్తగూడెం జిల్లా దమక్కపేట ఇసుక ర్యాంపు నుంచి వస్తున్నట్లుగా గుర్తించామని అన్నారు. అనంతరం లారీలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. రాజు, పోలీసు సిబ్బంది భూక్యా లక్ష్మణ్ నాయక్, విక్రమ్ తదితరులు ఉన్నారు.



పట్టుబడిన లారీతో అధికారులు

బ్రేక్ ఫెయిలై లారీ బోల్తా

మంగపేట : మండలంలోని తిమ్మంపేట మల్లూరు మధ్య గల కోడలు చెరువు సమీపంలో మూలమలుపు వద్ద రెడ్‌మిక్స్ కాంక్రీట్ (ఆర్‌సీఎం) లోడుతో వెళ్తున్న లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపు తప్పి బోల్తా పడిన సంఘటన బుధవారం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు నుంచి రెడ్ మిక్స్ కాంక్రీట్ లోడుతో లారీ వరంగల్‌కు వెళ్తోంది. మార్గమధ్య కోడలు చెరువు పోతురాజు స్వామి మూలమలుపు వద్ద బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకుపోయి బోల్తా పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ అంతరాయం కలుగుండా చర్యలు తీసుకున్నారు. లారీ నడుపుతున్న డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని పాత మరికాల గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఒకరు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. పాత మరికాల గ్రామంలో కూలీ పనుల కోసం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా పుట్కూర్ గ్రామానికి చెందిన సెమల సురేష్ (29) రెండు నెలల క్రితం బెస్త గూడెం గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద కూలీ పనులకోసం వచ్చాడు. కాగా మంగళవారం రాత్రి బెస్త గూడెం నుంచి పాత మరికిలలోని మిర్చి తోట వద్దకు వెళ్తున్న క్రమంలో వెనక నుంచి ద్విచక్ర వాహనం సురేష్‌ను ఢీకొట్టింది. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స అందజేశారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వెంకటాపురం ఎస్సై కొప్పుల తిరుపతి రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ములుగు రూరల్ : రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. జాతీయ రహదారిపై ఉన్న బారికేడ్లను బుధవారం తొలగించారు. డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వర్‌రావులు రోడ్డు ప్రమాద ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఎక్కువగా ఉండే గ్రామాల్లో రోడ్ సేఫ్టీ క్లబ్‌లతో పాటు వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామానికి సంబంధించిన గ్రామ పోలీస్ అధికారి, ప్రభుత్వ ఉద్యోగి, రోడ్డుకు ఇరువైపుల ఉన్న దుకాణ యజమానులను గ్రూప్‌లో చేర్పినట్లు పేర్కొన్నారు. మండలంలోని జంగాలపల్లి జంక్షన్, పెట్రోల్‌బంక్, కాశిందేవిపేట క్రాస్ వద్ద వాహనాలు యూ టర్న్ తీసుకునే క్రమంలో అవతలి వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో బారికేడ్లను తొలగించారు. వాహనదారులు రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే బాధితులను ఆస్పత్రికి తరలించి (గోల్డెన్ అవర్) ప్రాణాలు కాపాడడం, పోలీసులకు సమాచారం అందించడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.



బారికేడ్లు తొలగించాలని సూచిస్తున్న పోలీసులు

చెరుకూరు అడవిలో మంటలు



వాజేడు : మండల పరిధిలోని చెరుకూరు పక్కన ఉన్న అడవిలో బుధవారం మంటలు చెలరేగాయి. మంటలు అంటుకున్న సమయంలో అటవీ శాఖ మహిళా ఉద్యోగిని అటుగా రావడంతో గ్రామస్తులకు సమాచారం అందించింది. దీంతో స్థానికులు నీటితో మంటలను ఆర్పివేశారు.

రేపు తైబజార్ వేలం

ఏటూరునాగారం : గ్రామ పంచాయతీ తైబజార్ బహిరంగ వేలం పాటను ఈనెల 28న నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంపచిట్టి పాటలో పాల్గొనే వ్యక్తులు రూ.25వేలు డిపాజిట్ చేయాలని, కమీశాకు రూ.10వేలు డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

మంగపేట : మండలంలోని నిమ్మగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బుధవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై టీవీఆర్ సూరి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మద్దెల చంద్రరావు (38) మద్యానికి బానిసయ్యాడు. భార్య తాగొద్దని ఎంత చెప్పినా వినిపించుకోకుండా అతిగా మద్యం తాగుతూ ఉండేవాడు. కుటుంబ సభ్యుల ప్రోద్బలంతో మూడు నెలల క్రితం మద్యం మానివేయగా అనారోగ్య సమస్యలు తలెత్తాయి. వైద్యం చేయించుకున్నా ఆరోగ్యం కుదుట పడక పోవడంతో 20 రోజుల నుంచి మళ్లీ మద్యం తాగుతున్నాడు. అనారోగ్య సమస్యలతో పాటు మద్యం మానలేక తీవ్ర మనస్తాపంతో అతిగా మద్యం తాగి మత్తులో ఉన్న చంద్రరావు బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. సంఘంపల్లి నుంచి పూరేడుపల్లికి వెళ్లే అటవి మార్గంలోని ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య త్రివేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

కొండాయి బ్రిడ్జి వెంటనే నిర్మించాలి

ఏటూరునాగారం : మండలంలోని కొండాయి బ్రిడ్జిని వెంటనే నిర్మించాలి, జంపన్నవాగుపై వేసిన శంకుస్థాపన శిలాఫలకానికే పరిమితమైందని బీజేపీ రాష్ట్ర నాయకుడు జాడి రామరాజు విమర్శించారు. బుధవారం మండలంలోని కొండాయి బ్రిడ్జి వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు వినుకోలు చక్రవర్తి ఆధ్వర్యంలో శిలాఫలకానికి బీజేపీ నాయకులు కొబ్బరికాయ కొట్టి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొండాయి బ్రిడ్జికి మంత్రి సీతక్క శంకుస్థాపన చేసి ఏడాది ముగిసిందన్నారు. వెంటనే పనులు ప్రారంభించి లోతట్టు గ్రామాల ప్రజల కష్టాలను తీర్చాలన్నారు. కార్యక్రమంలో హరిబాబు, వేలేందర్, రాజశేఖర్, శ్రీనివాస్, మహేష్, రఘు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఏటూరునాగారం : విద్యార్థులు వేసవిలో జాగ్రత్తలు పాటించాలని కొండాయి వైద్యాధికారి ప్రణీత్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మల్యాల ఆశ్రమ పాఠశాలలో వైద్యాధికారులు విద్యార్థులకు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎండ వేడిమి నుంచి అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులను పరీక్షించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శేషయ్య, ఉపాధ్యాయుడు వేణుగోపాల్, ఏఎన్ఎం సమ్మక్క, నాగమణి, ఆశ కార్యకర్తలు సునీత, భాగ్య పాల్గొన్నారు.

‘యువ ఉత్సవ్’లో విద్యార్థుల ప్రతిభ

ఏటూరునాగారం : యువ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారని స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ రేణుక అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువ ఉత్సవ్‌లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటయ్య, జ్యోతి, కనీఫ్ ఫాతిమా, సంపత్, రమేష్, జీవవేణి, మున్ని, భావన, భాస్కర్ పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ రేణుక

యువత ఆదర్శంగా నిలవాలి

- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సూర్య

ములుగు : భవిష్యత్ క్రీడాకారులకు నేటి యువత ఆదర్శంగా నిలవాలని క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య సూచించారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని తంగేడు స్టేడియంలో బీపీఎల్ పేరుతో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్‌తో కలిసి సూర్య బుధవారం ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని, మొదటి మూడుస్థానాల్లో నిలిచే జట్లకు తన వంతుగా కిట్లను అందిస్తానని పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలో స్విమ్మింగ్‌పూల్‌తో పాటు ప్రతి మండల కేంద్రంలో స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదించామని చెప్పారు. జిల్లాలోని క్రీడా ఆణిముత్యాలు బయటికి వస్తే మంచి గుర్తింపునివ్వడంతో పాటు వారి కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. త్వరలో యూత్ కాంగ్రెస్ తరఫున మెగా టోర్నమెంట్‌ను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల భరత్, ఇస్సార్‌ఖాన్, సుమన్‌రెడ్డి, నాగరాజు, కోచ్ సందీప్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎస్‌తాడ్వాయి: గెలుపొందిన క్రీడాకారులతో ధనసరి సూర్య

యువత క్రీడల్లో రాణించాలి

ఎస్ఎస్‌తాడ్వాయి : యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి ధనసరి సూర్య అన్నారు. మండలంలోని ఆంకంపల్లిలో సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. చదువుతోపాటు విద్యార్థులు, యువత క్రీడలపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వాలీబాల్ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రోత్సాహకంగా రూ.10వేలు నగదు అందజేశారు. మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మేడారం జాతర ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ అరెం లచ్చుపటేల్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండీ ముజఫర్, మాజీ ఎంపీటీసీలు భవానీనారాయణ, మంకిడి నర్సయ్య, మాజీ సర్పంచ్ నర్సింహాస్వామి, పీఏసీఎస్ డైరెక్టర్ యానాల సిద్దిరెడ్డి, నాయకులు పల్నాటి సత్యం, రామస్వామి, మంకిడి సమ్మయ్య, వంగరి సదానందం , అలెం రమేష్, మంకిడి రవి, యువజన కాంగ్రెస్ మండల నాయకుడు మర్రి నరేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ములుగు రూరల్: పరామర్శిస్తున్న సూర్య



ఎస్ఎస్‌తాడ్వాయి: సాయం అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్ : మండలంలోని పంచోత్కులపల్లి గ్రామానికి చెందిన దేవరనేని రాధమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనసరి సూర్య బుధవారం పరామర్శించారు. రాధమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, నేపాల్‌రావు, బండి మధు, తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

ఎస్ఎస్‌తాడ్వాయి : బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని బీసీ సెల్ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ డైరెక్టర్ యాశడపు మల్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని కాల్వపల్లికి చెందిన కొప్పుల చిన్నన్న ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి రూ.7వేల ఆర్థికసాయం అందజేశారు. గొత్తికోయగూడెనికి చెందిన హుంగయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు సిద్దబోయిన శ్రీను, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు సుధాకర్, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు పురుషోత్తం నారాయణ, నాయకులు కొప్పుల నగేష్, అంబటి రవి, కొప్పుల కార్తీక్, పిరీల శ్రావణ్, పర్షబోయిన నరసింహులు, అంబటి సమ్మయ్య, పుర్రి సమ్మయ్య, భూషబోయిన మొగిలి, కట్కూరి ప్రభాకర్‌రెడ్డి, రమేష్, ఆశోక్, మహిళా నాయకురాలు కుడుముల సుగుణ పాల్గొన్నారు.

కోలుకున్న వలస కూలీలు

వాజేడు : ఉడికి ఉడకని చికెన్ తిని అస్వస్థతకు గురైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వలస కూలీలను పేరూరు వైద్య సిబ్బంది బుధవారం పరిశీలించారు. 12మంది కూలీలను మంగళవారం పేరూరు వైద్యశాలకు తరలించి వైద్యం అందించిన విషయం తెలిసిందే. కాగా వారు పూర్తిగా కోలుకున్నారో లేదోనని వైద్యసిబ్బంది కూలీలు నివాసం ఉంటున్న మండల పరిధిలోని చింతూరుకు వెళ్లి మరోమారు పరీక్షించారు. అందరూ ఆరోగ్యంగా ఉన్నట్లు హెచ్ఈఓ వేణుగోపాల కృష్ణ వివరించారు.



వలస కూలీలను పరీక్షిస్తున్న సిబ్బంది